ఈ రోజు బాలోత్సవభవన్‌లో జరిగిన సిపిఐ(ఎం) ప్రెస్‌మీట్ నోట్‌ను ప్రచురణార్థం పంపుతున్నాము.


– జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి
94900 98000


---

**విద్వేష రాజకీయాలకు ప్రజల ఎజెండాతో చెక్**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు**

**జనం కోసం సిపిఎం పోస్టర్ ఆవిష్కరణ**

**రాష్ట్రంలో ప్రజల పరిస్థితి దుర్భరంగా మారింది**

**బిజెపిపై వైసిపి, టిడిపి వైఖరి ఏమిటో చెప్పాలి**

రాష్ట్రంలో ప్రజలు పీకల్లోతు కష్టాల్లో ఉంటే బిజెపి, వైసిపి, టిడిపి ఎన్నికలు ఎత్తులు పొత్తులు గురించి అన్నిటికన్నా మించి కులమత విద్వేషాలు రగిలించి ప్రజల్లో చీలికలు పెట్టేందుకు, రాజకీయంగా లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తున్నాయని, ఇటువంటి విద్వేష రాజకీయాలకు ప్రజల ఎజెండాతోనే చెక్ పెడతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. సిపిఎం చేపట్టిన 'జనం కోసం సిపిఎం' కార్యక్రమ పోస్టర్‌ను గురువారం బాలోత్సవ్ భవన్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.ఎ.గఫూర్, ఎం.సీతారామ్, డి.రమాదేవితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఎజెండా తీసుకుని ప్రజల సమస్యలను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్న పాలకుల విధానాలకు ప్రత్యామ్నాయంగా జనం కోసం సిపిఎం పేరుతో ప్రజల అజెండాను ప్రముఖంగా ముందుకు తీసుకొచ్చేందుకు జూన్‌లో క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రజల బాధలు పెరిగిపోతున్నాయని, వీటిని పక్కదారి పట్టించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు, వాటి ఆధారంగా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ ఆందోళనలు, పోరాటాలు క్షేత్రస్థాయిలో నిర్వహించేందుకే ఇంటింటికీ సిపిఎం కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. జూన్, జులై అవసరమైతే ఆగస్టులోనూ ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. ప్రజలకు మంచినీళ్లు, ఇళ్లు, ఇళ్లపట్టాలు లేవని, ఎక్కడకు వెళ్లినా సమస్యలు ఉన్నాయని తెలిపారు. కొన్ని జిల్లాల్లో ఇంటింటికీ తిరిగి సర్వే చేశామని, ఇంతకుముందున్న దానికంటే ప్రజల పరిస్థితి మరీ దిగజారిందని పేర్కొన్నారు. ఆదాయాలు పెరగలేదని, ఖర్చులు పెరుగుతున్నాయని, ఉపాధి లేదని, బతకడం కష్టంగా మారి ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా ఇళ్లలో ఉంటున్న వృద్ధులను పలకరిస్తే కన్నీళ్లు పెట్టుకుంటున్నారని, ఇలాంటి దీన స్థితి ఎన్నడూ లేదన్నారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే కారణమన్నారు. రాష్ట్రంలో మూడేళ్లలో ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా పెరిగిన భారాలతో ప్రజలు అల్లాడుతున్నారని, సంక్షేమ పథకాలూ ఏ మూలకూ చాలడం లేదని, వాటిల్లోనూ కోత మొదలైందని ప్రజలూ ఆందోళనలో ఉన్నారన్నారు.

బిజెపి నాయకులు నడ్డా రాష్ట్రంలో పర్యటించి కులాలు, మతాల పేరుతో విద్వేషాలు రగిలించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు పేరు ఉచ్చరించే అర్హత కూడా బిజెపి నాయకులకు లేదని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి ద్రోహం చేసి బ్రిటీషు వారికి కొమ్ముకాసిన వారికి అల్లూరి పేరు ఎత్తే అర్హత లేదన్నారు. అల్లూరి పేరుతో ఓట్లు దండుకోవాలనే దుర్బుద్ధి బిజెపి వారికి ఉందని విమర్శించారు. బిజెపి నాయకులు నిజంగా రాష్ట్రానికి మేలు చేయాలని అనుకుంటే ప్రధానితో ప్రత్యేక హెూదా ప్రకటించి విభజన హామీలు అమలు చేయించాలని కోరారు. ఎనిమిదేళ్ల పాలనలో బిజెపి రాష్ట్రానికి చేసిందేమీ లేదని తెలిపారు. ప్రజల కోసం చేసిన పనులేమిటో ఒక్కటంటే ఒక్కటి చెప్పాలని సవాల్ చేశారు. ధరలు తగ్గలేదని, ఉద్యోగాలు ఇవ్వలేదని, రైతులకు ఆదాయం పెరగలేదని విదేశాల్లో ఉన్న నల్లడబ్బును తీసుకురాలేదని, అవినీతిని నిర్మూలించలేదని అన్నారు. పైగా నిత్యావసరాలు, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచారని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ పథకం తమదేనని నడ్డా చెబుతున్నారని, కేంద్రం తీసుకొచ్చింది ఆరోగ్యశ్రీకాదని, ఆత్మహత్యల పథకమని, గిట్టుబాటు లేక

రైతులు లక్షల సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. మద్దతు ధర అని చెబుతూ వరికి క్వింటాకు రూ.100 పెంచారని వివరించారు. 75 కిలోల బస్తాకు రూ.75 పెంచారని, ఖర్చు రు.250 పెరిగిందని దీన్ని గిట్టుబాటు ధరగా ప్రచారం చేసుకోవడం అన్యాయమని అన్నారు. అదే సమయంలో ఏడాదికాయేడు వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు రెట్టింపు అవుతుంటే కిలో వరికి రూపాయి పెంచడం ఏమిటని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం దేశాన్ని దివాళా తీయిస్తోందని తెలిపారు. దీన్ని పక్కదారి పట్టించేందుకు మతాన్ని ముందుకు తీసుకొస్తున్నారని అన్నారు. బిజెపి నాయకుల చర్యలతో దేశ ప్రతిష్ట ప్రపంచ వ్యాప్తంగా మంటగలిసిపోయిందని వివరించారు. బిజెపి అధికార ప్రతినిధి నుపుర్‌శర్మ ఇతర దేవుళ్ల గురించి అసభ్యంగా మాట్లాడితే ప్రపంచం ఛీకొట్టిందని తెలిపారు. అయితే వారిని పార్టీ నుండి సస్పెండ్ చేశామని చెబుతున్నారని, నిజంగా వారిపై కేసుపెట్టి జైల్లో పెట్టాలని అన్నారు. బిజెపి అనుసరిస్తున్న ఇటువంటి మతోన్మాద విధానాలపై రాష్ట్రంలో ఉన్న వైసిపి, బిజెపి వైఖరి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. రోజూ మైనార్టీలు, లౌకికతత్వం గురించి మాట్లాడే వారికి ఆ లక్షణాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బిజెపి నాయకులు ఇతర మతస్తులను, దేవుళ్లను కించపరుస్తుంటే మాట్లాడకపోతే వారు లౌకికవాదులని ఎలా రుజువు అవుతుందని ప్రశ్నించారు. పైగా బిజెపితో పొత్తు పెట్టుకునేందుకు రెండు పార్టీల నాయకులు తహతహలాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో నడ్డా డబుల్ ఇంజన్ స్పీడుతో అభివృద్ధి చేస్తామని చెబుతున్నారని, అది అభివృద్ధి కాదని, దాన్ని కూల్చే బుల్డోజర్ రాజకీయమని అన్నారు. తాడేపల్లిలో సిఎం ఇంటికి సమీపంలో నివశిస్తున్న వందలాదిమందికి పట్టాలు లేవని, రైల్వేకాలనీలో 900 మందికి బతుకుతున్నారని, వారికి పట్టాలు ఇవ్వకపోతే రిపేర్లు కూడా చేసుకోనీయడం లేదని, నిలువ నీడ లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇల్లు కట్టిస్తామని చెబుతున్నారని, వాస్తవంలో ఇల్లు కూలుస్తున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వం కూడా బిజెపి, మోడీ అనుసరిస్తున్న విధానాలనే అనుసరిస్తున్నారని అన్నారు. రాజశేఖర్‌రెడ్డి పేరు పెట్టుకుని మోడీ విధానాలను అనుసరిస్తున్నారని ఇద్దరిలో ఎవరు ఆదర్శమో తేల్చుకోవాలన్నారు.

నిజంగా ప్రజల సంక్షేమాన్ని కోరుకునేవారైతే గ్యాస్‌ను రూ.500కు ఇవ్వాలని, నిత్యావసరాల ధరలు తగ్గించాలని బిజెపిని కోరారు. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో సిపిఎం ప్రజల్లోకి వెళుతోందని తెలిపారు. ఎన్నికలు, కుల మత విద్వేషాలుపెంచే ఎజెండా, బుల్డోజర్ రాజకీయాలకు వ్యతిరేకంగా సిపిఎం ఇంటింటికీ వెళుతుందని అన్నారు. సమస్యలపై నెలంతా సచివాలయాలు, మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపడతామని, అక్కడ పరిష్కరించకపోతే కలెక్టరేట్ల వద్ద ఆందోళన కొనసాగిస్తామని వివరించారు. ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ వామపక్షాలు, ఇతర కలిసొచ్చే శక్తులతో కలిసి రాష్ట్ర ప్రజల ఎజెండాను ప్రధాన ఎజెండాగా తీసుకుని విధ్వంస రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయం రాజకీయాల కోసం పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి రగులుతోందని తెలిపారు. మంత్రులూ ప్రజలకు సమాధానం చెప్పలేక గడపగడపకూ ఆపేశారని తెలిపారు. దళిత యువకుడిని హత్యచేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేస్తే ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని, యం.యల్.సి. పదవి నుండి తప్పించకుండా ఎలా సామాజిక న్యాయం చేస్తుందని ప్రశ్నించారు. అంబేద్కర్ పేరుతో జిల్లా పేరు పెడతామంటే వ్యతిరేకించే బిజెపి ప్రజలకు ఏం చేస్తుందని ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్షం టిడిపి ప్రజల అభిప్రాయాలను పట్టించుకోవడం లేదని అన్నారు. బిజెపితో కలిస్తే మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో చేపడుతున్న జనం కోసం సిపిఎం కార్యక్రమాన్ని ఆదరించి ఆహ్వానించి జయప్రదం చేయాలని కోరారు.

= = = =